# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

“ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం” అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 164 | పేజీలు : 08 | సోమవారం | 22-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## హైడ్రాలు, బుల్డోజర్లు పేదోళ్ల ఇళ్లపైకేనా?

**చెరువుల్లో ఇళ్లు, ఫాంహౌస్‌లున్న పెద్దోళ్ల ఇంటికి వెళ్లవా?: కేటీఆర్**

**అండగా ఉంటామని రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్ వాసులకు భరోసా..**



హైదరాబాద్ పల్స్,డెస్క్
‘హైడ్రాలు, బుల్డోజర్లు పేదోళ్ల ఇళ్లపైకే వస్తాయా..? పెద్దోళ్ల ఇళ్లపైకి వెళ్లవా..?’ అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సర్కారుపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ఉంది పేదోళ్లకు కొత్త ఇళ్లు కట్టించి ఇవ్వడానికి గానీ, కూల్చడానికి కాదన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ఇక్కడి 350కి పైగా ఇళ్ల నివాసితులను ఖాళీ చేయించేందుకు సర్కారు సమాయత్తమవుతున్న నేపథ్యంలో వారితో సమావేశమై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎప్పుడూ పేదల పక్షమేనంటూ భరోసా కల్పించారు. ‘హైడ్రాలు, బుల్డోజర్లు దుర్గంచెరువు

## మంటలు చెలరేగి.. ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం

**డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం**

**కరీంనగర్ సమీపంలోని అలుగునూర్ శివారులో ఘటన..**



హైదరాబాద్ పల్స్,డెస్క్
ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు చెలరేగి.. చూస్తుండగానే క్షణాల్లో దగ్ధమైంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో త్రుటిలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఆదివారం కరీంనగర్ జిల్లా అలుగునూర్ శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. కరీంనగర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ సహా 42 మందితో కరీంనగర్ బస్టాండ్ నుంచి ఉదయం హైదరాబాద్‌కు బయల్దేరింది. అలుగునూర్ దాటి తర్వాత కాకతీయ కాలువ వద్దకు చేరుకోగానే బస్సులో నుంచి కాలిన వాసన రావడంతో డ్రైవర్ బోయిని ప్రశాంత్ అప్రమత్తమయ్యాడు. సమీపంలో పెట్రోల్ బంక్, విద్యుత్తు తీగలుండటంతో ప్రమాదాన్ని ఊహించి కొంచెం ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన సురక్షిత ప్రాంతంలో నిలిపేశాడు.

# నీట్ అభ్యర్థుల కోసం...

**ప్రయాణాన్ని వాయిదా వేసుకున్న పీఎం మోదీ**

**నీట్ విద్యార్థుల కోసం ఆగిపోయిన పీఎం మోదీ కాన్వాయ్**

**ట్రాఫిక్ జామ్ కాకూడదనే ఉద్దేశంతో!**





హైదరాబాద్ పల్స్,డెస్క్
నీట్ రీ-ఎగ్జామ్ రాయడానికి వెళ్లే విద్యార్థులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు రాకూడదని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం కీలక నిర్ణయం తీసుకున్నారు. దిల్లీ విమానాశ్రయం నుంచి తన కాన్వాయ్ బయలుదేరితే, రోడ్లపై ట్రాఫిక్ జామ్ అవుతుందని భావించి, తన ప్రయాణాన్ని కొద్దిసేపు వాయిదా వేసుకున్నారు. వాస్తవానికి ప్రధాని మోదీ మధ్యాహ్నం 1:15 గంటలకే దిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం 2 గంటలకు నీట్ పరీక్ష జరగాల్సి ఉండడంతో, విద్యార్థులు ఎక్కడా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కోకుండా, సజావుగా తమ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని మోదీ భావించారు. అందుకే తన ప్రయాణాన్ని వాయిదా వేసుకొని మధ్యాహ్నం 2 గంటల తర్వాతే అక్కడి నుంచి బయలుదేరారు.

**అది గొప్ప నాయకత్వానికి నిదర్శనం!**

ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయంపై కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ ప్రశంసలు కురిపించారు. “కొందరికి అధికారం అంటే హోదా. కానీ ప్రధాని నరేంద్ర మోదీకి అది ఒక బాధ్యత. నీట్ విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండడం కోసం ఆయనే స్వయంగా ఎయిర్‌పోర్టులో వేచి ఉండడం, ప్రజలకే మొదటి ప్రాధాన్యత ఇచ్చే ఆయన నాయకత్వానికి నిదర్శనం” అని

## ఢిల్లీలో సీఎం



హైదరాబాద్ పల్స్,డెస్క్
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం ముంబయి నుంచి ఢిల్లీకి చేరుకున్న సీఎం నేరుగా తుగ్లక్‌రోడ్‌లోని తన నివాసానికి చేరకున్నారు.

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యల కేసు



## యోగా నాకు చాలా ఇచ్చింది

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**యోగతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్**

**తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి**

**యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు**



హైదరాబాద్ పల్స్,డెస్క్
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’లో తన అభిప్రాయాలను పంచుకున్నారు.“భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది.

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు..

**రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు**



హైదరాబాద్ పల్స్,డెస్క్
క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ

**సోమవారం బసవతారకం ఆసుపత్రి రజతోత్సవాలు**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఏపీ సీఎం చంద్రబాబు**

**25 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు నిరంతర సేవలు**

**ఎన్టీఆర్ ఆశయాలను చైర్మన్‌గా కొనసాగిస్తున్న బాలకృష్ణ**

**పేదలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం**

## హోర్ముజ్ మళ్లీ మూత

**ఇరాన్ చర్యను ధ్రువీకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

**దాడులు ఆపకపోతే ఇరాన్‌ను లేకుండా చేస్తామని హెచ్చరిక**

**హోర్ముజ్ జలసంధిలో తామే టోల్ వసూలు చేస్తామని ప్రకటన**

**ప్రపంచానికి మళ్లీ చమురు కష్టాలు?**

**హోర్ముజ్ బంద్‌కు ట్రంపే కారణం: జర్మనీ**

**స్విట్జర్లాండ్‌లో చర్చలు.. ఇరాన్ వాకౌట్**



## 30లోగా కమిటీలు పూర్తిచేయండి

**సర్ పట్ల అప్రమత్తంగా ఉండండి ..**

**లోక్‌సభ ఇన్‌చార్జిల సమావేశంలో మీనాక్షి దిశానిర్దేశం**




హైదరాబాద్ పల్స్,డెస్క్
ఈ నెల 30కల్లా కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి కావాలని లోక్‌సభ ఇన్‌చార్జిలను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఆదేశించారు. రాబోయే ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి చాలా కీలకమని, గ్రామస్థాయి నుంచీ పార్టీ బలోపేతంపైన

## మరింత తీవ్రంగా దాడి చేస్తాం...

**ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్**



## యోగా నాకు చాలా ఇచ్చింది

మొదటి పేజీ తరువాయి

ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**విశాఖలో ఘనంగా యోగా వేడుకలు**

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు, సాధారణ పౌరులు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## హైడ్రాలు, బుల్డోజర్లు పేదోళ్ల ఇళ్లపైకేనా?

మొదటి పేజీ తరువాయి



తలాబ్‌లో ఇల్లు కట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి అన్న ఇంటికి వెళ్లవా.. రేవంత్ తన గ్రామంలో కట్టుకున్న రెడ్డి కుంట ఇంటికి వెళ్లవా..? అంతెందుకు హిమాయత్‌సాగర్ జలాశయంలో ఫాంహౌస్‌లు, ఇండ్లు కట్టుకున్న మంత్రులు వివేక్, పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి ఇళ్లపైకి వెళ్లవా..?' అని ప్రశ్నించారు. 'హనుమాన్‌నగర్‌వాసులు ఐక్యంగా ఉండి ఒక్క ఏడాది తమ ఇళ్లను కాపాడుకోవాలి. మీ వెంట కార్తీక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మేమంతా ఉంటాం.. సంవత్సరం తర్వాత 2028 చివరిలో రాష్ట్రంలో ఎన్నికలు వస్తాయి. అప్పుడు సీఎంగా మీరు కోరుకుంటున్న కేసీఆర్ వస్తారు. మీ అందరికీ ఇళ్ల పట్టాలిస్తాం' అని హామీనిచ్చారు. ముఖ్యమంత్రి పదవిని గుంపు మేస్త్రీ పదవితో పోల్చుకున్న రేవంత్‌కు.. గుంపు మేస్త్రీ ఇళ్లను కడతాడు కానీ కూల్చడన్న సంగతి తెలియదా అని ఎద్దేవా చేశారు. 'వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తానన్నాడు.. కోడళ్లకు మహాలక్ష్మి కింద రూ.2,500, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి ద్వారా లక్షా నూట పదహార్లు కాక తులం బంగారం, ఇటు విద్యార్థినీలకు స్కూటీలు ఇస్తానన్నాడు.. గద్దెనెక్కి రెండున్నరేళ్లు దాటుతున్నా అవన్నీ ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి' అని రేవంత్‌ను డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం శంషాబాద్‌లో 180 ఎకరాల సీలింగ్ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసింది. శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయంపై ఇటీవల జరిగిన ఏసీబీ దాడుల్లో ఈ విషయం వెల్లడైంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు చుట్టూ ఉన్న భూములను సీఎం రేవంత్ తన అనుయాయులకు అప్పజెపుతున్నారు' అని కేటీఆర్ ఆరోపించారు. శంషాబాద్ జోన్ కేంద్రంలోని జేడీ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండి ఓటర్ జాబితాలో దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని సూచించారు.

## ఢిల్లీలో సీఎం

మొదటి పేజీ తరువాయి

సోమ, మంగళవారాల్లో ఢిల్లీలోనే ఉండనున్న ముఖ్యమంత్రి.. ఈ సందర్భగా పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. కేంద్ర రసాయన, ఎరువుల మంత్రి జేపీ నడ్డా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ కలిసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఖరీఫ్ సీజన్ రావడంతో రాష్ట్ర రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవడంపై జేపీ నడ్డాకు, ఇటీవల రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్ర రక్షణ శాఖ అనుమతివ్వడంతో రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతారని ఆ వర్గాలు తెలిపాయి.



బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి

## 25 ఏళ్లు..

మొదటి పేజీ తరువాయి

చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన అర్ధాంగి బసవతారకం జ్ఞాపకార్థం, ఆమె చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ చికిత్స సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 1988లో ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య నిపుణులు, దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకలతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు విస్తరిస్తూ నేడు 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే సమగ్ర క్యాన్సర్ చికిత్సాలయంగా పేరు పొందింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాలకృష్ణ ఛైర్మన్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తండ్రి ఆశయాన్ని పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లకు, 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో 65 శాతానికి పైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే ఉండటం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా కూడా వేలాది మందికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇప్పటివరకు 8 వేలకు పైగా విజయవంతమైన క్యాన్సర్ సర్జరీలు, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలు ఇక్కడ నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అత్యాధునిక సదుపాయాలున్న మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ వంటి విభాగాల్లో సుమారు 250 మంది నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు. సోమవారం జరగనున్న రజతోత్సవ వేడుకలకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరై ఆసుపత్రి 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని స్మరించుకోనున్నారు.

## మంటలు చెలరేగి.. ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం

మొదటి పేజీ తరువాయి

వెంటనే ఎమర్జెన్సీ డోర్ తెరవడంతో పాటు అందరూ దిగిపోవాలని కోరాడు. ఆందోళనలో కొందరు ప్రయాణికులు అద్దాలు పగలగొట్టుకుని కిటికీల నుంచి బయటకు దూకారు. ప్రయాణికులు దిగిన కొన్ని నిమిషాల్లోనే బ్యాటరీలు ఉన్న బాక్సుల నుంచి మంటలు వేగంగా వ్యాపించి బస్సును చుట్టుముట్టాయి. డయల్ 100కు కాల్ చేయడంతో ఎల్ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ప్రమాదం జరిగిన 40 నిమిషాలకు ఫైరింజన్ సంఘటనా స్థలానికి చేరుకుంది. మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది 2 గంటలకు పైగా శ్రమించి మంటలకు అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఆర్టీసీలో జేబీఎం ఎకో కంపెనీ నుంచి అద్దె ప్రతిపాదికన ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టిన తర్వాత ఇలాంటి ప్రమాదం చోటుచేసుకోవడం ఇదే తొలిసారికావడంతో.. ప్రమాదానికి గల సాంకేతిక కారణాలపై ఆర్టీసీ, రవాణా శాఖ, పోలీసు శాఖల అధికారులు విచారణ చేపడుతున్నారు.

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యల కేసు

మొదటి పేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి జూన్ 22వ తేదీన శ్రీకాకుళం జిల్లా హిరమండలం పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. 2025 మార్చి నెలలో పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి దువ్వాడ శ్రీనివాస్ సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై హిరమండలం మండలం గొట్టు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పిన్నింటి చిన్నారావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పటి కొత్తూరు సీఐ సి.హెచ్. ప్రసాద్ కేసు నమోదు చేశారు. ఈ పాత కేసుకు సంబంధించి దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు, తాజాగా దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు పంపారు. విచారణ నిమిత్తం వ్యక్తిగతంగా హాజరు కావాలని అందులో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం (22వ తేదీన) ఆయన పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. ఈ పాత కేసులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు జారీ కావడం రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.



## 30లోగా కమిటీలు పూర్తిచేయండి

మొదటి పేజీ తరువాయి

దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ఈ నెల 25 నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్(సర్) ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం పురోగతి, సర్ ప్రక్రియపై ఆదివారంనాడు గాంధీభవన్‌లో లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మీనాక్షితో పాటుగా టీపీసీసీ చీఫ్ మహ్హ?షగౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న సర్ ప్రక్రియనే వచ్చే ఎన్నికల్లో ఓటర్లు ఎవరన్నది నిర్ణయిస్తుందని, ఈ నేపథ్యంలో ఆ ప్రక్రియ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మహ్హ?షగౌడ్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకం కావాలన్నారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలన్నారు. సర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా: మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి.. కేంద్రంలో బీజేపీ 12 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుకు టీపీసీసీ అధ్యక్షుడు మహ్హ?షకుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, విదేశాల నుంచి నల్లధనాన్ని తెచ్చి పేదల అకౌంట్లలో వేస్తామంటూ ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఇచ్చిన హామీల అమలు గురించి రాంచందర్‌రావు మాట్లాడాలన్నారు. ఆయన తమకు ప్రధాని మోదీ సమయం ఇప్పిస్తే బీజేపీ మూడు ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీల అమలు గురించి అడుగుతామన్నారు. ఆ తర్వాత రాహుల్‌గాంధీ సమయం గురించి మాట్లాడవచ్చన్నారు. గాంధీభవన్‌లో ఆదివారంనాడు మీడియాతో ఈ మేరకు మాట్లాడారు. కాగా.. లంబాడాలకు ఎస్టీ రిజర్వేషన్లు అమలై 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 25 నుంచి ఆదివాసీ కాంగ్రెస్ బస్సుయాత్ర చేపట్టనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం నాడు మహేశ్‌గౌడ్ ఆవిష్కరించారు.

## మరింత తీవ్రంగా దాడి చేస్తాం...

మొదటి పేజీ తరువాయి

ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో కీలక చర్చలు జరుగుతుండగానే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపుల కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని, లేదంటే గత వారం కంటే మరింత తీవ్రమైన సైనిక చర్య తప్పదని ఆదివారం స్పష్టం చేశారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "లెబనాన్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్న తమ ప్రాక్సీ గ్రూపులను ఇరాన్ వెంటనే ఆపాలి. అలా చేయని పక్షంలో, మేం గత వారం కంటే ఈసారి చాలా గట్టిగా ఇరాన్‌పై దాడి చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు, లెబనాన్ సహా ఇతర ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు చేరుకున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఈ నెల ప్రారంభంలో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అణు అంశాలు, హోర్ముజ్ జలసంధి, లెబనాన్‌తో సహా పలు ప్రాంతాల్లో కాల్పుల విరమణపై 60 రోజుల పాటు చర్చలు జరపాలని ఇందులో నిర్ణయించారు. అయితే, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు, హిజ్బుల్లా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగడంతో స్విస్ చర్చలు ఆలస్యమయ్యాయి. లెబనాన్‌లో కాల్పుల విరమణను కాపాడే ప్రయత్నాలపై ఉపాధ్యక్షుడు వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి ఒప్పందాల అమలులో కొన్ని ఇబ్బందులు సహజమేనని, పరిస్థితి సున్నితంగా ఉందని అంగీకరించారు. అధ్యక్షుడు ట్రంప్ తమకు పూర్తి అధికారాలు ఇచ్చారని వెల్లడించారు. ఇరాన్ అణ్వాయుధాలపై ఆశలు వదులుకుంటేనే అమెరికాతో సత్సంబంధాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. శాశ్వత కాల్పుల విరమణకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని వాన్స్ ఉద్ఘాటించారు. కాగా, ట్రంప్ తాజా హెచ్చరికలపై ఇరాన్ నుంచి తక్షణమే ఎలాంటి స్పందన రాలేదు.

## నీట్ అభ్యర్థుల కోసం...

మొదటి పేజీ తరువాయి

అన్నారు.

నీట్-కంప్లీట్!

2023 మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో దానిని ఎన్?టీఏ రద్దు చేసింది. అందుకే ఇప్పుడు రీ-ఎగ్జామ్ పెట్టారు. దేశవ్యాప్తంగా 551 కేంద్రాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నీట్ పరీక్ష నిర్వహించారు. పెన్ అండ్ పేపర్ విధానంలో ఈ పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నీట్ పరీక్ష రాసేందుకు అవకాశం ఇచ్చారు. దివ్యాంగులకు అయితే సాయంత్రం 6:20 వరకు పరీక్ష రాసేందుకు అనుమతి ఇచ్చారు. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మందికి పైగా ఈ పరీక్షను మళ్లీ రాశారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

అయితే ఈసారి ఎలాంటి లీకేజీలు, అవకతవకలు జరగకుండా ఎన్‌టీఏ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లే ముందు మెటల్ డిటెక్టర్లతో విద్యార్థులను తనిఖీ చేశారు. పరీక్ష రాసే గదులన్నింటిలోనూ సీసీటీవీ కెమెరాలు పెట్టి నిరంతరం నిఘా ఉండేలా చూశారు. మొబైల్ సిగ్నల్స్ పనిచేయకుండా జామర్లు పెట్టారు. మరీ ముఖ్యంగా ఎన్‌టీఏ ప్రతి గదిలో ఇద్దరు ఇన్విజిలేటర్లను ఉంచింది. ప్రతి సెంటర్లో 10 మంది కంటే ఎక్కువ అధికారులను పర్యవేక్షణకు ఉంచింది. విద్యార్థులను తనిఖీ చేసేందుకు 38,795 మంది సిబ్బందిని, ముఖ గుర్తింపు (ఫేస్ ఐడెంటిఫికేషన్) కోసం 48,448 మంది బయోమెట్రిక్ సిబ్బందిని పెట్టారు. వీరితోపాటు దాదాపు 6,700 మంది అబ్జర్వర్లు, ప్రతి సెంటర్‌కు 40 నుంచి 50 మంది భద్రతా సిబ్బంది కాపలా ఏర్పాటు చేశారు.

ఎగ్జామ్ పేపర్స్ భద్రత కోసం ఎయిర్‌ఫోర్స్ సాయం

ఇక పరీక్ష పత్రాల భద్రత కోసం పోలీసులు, పారామిలిటరీ దళాలు, ఇండియన్ ఎయిర్?ఫోర్స్, పోస్టల్ శాఖ సహాయం తీసుకున్నారు. రహస్య పత్రాలు (కాన్ఫిడెన్షియల్ మెటీరియల్) అన్నింటినీ బ్యాంకుల్లో భద్రపరిచి, సరిచూశారు. ఇక విద్యార్థుల సౌకర్యం కోసం ఎన్‌టీఏ పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచింది. ఎగ్జామ్ హాల్‌లో గోడ గడియారాలు పెట్టారు. రఫ్ వర్క్ చేసుకోవడానికి అదనపు కాగితాలు ఇచ్చారు. ఎడమ చేతివాటం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా షీట్లు ఇచ్చారు. లోపలికి వచ్చేటప్పుడు తనిఖీల వల్ల లేట్ అయిన సమయాన్ని భర్తీ చేయడానికి విద్యార్థులకు అదనపు సమయం కూడా ఇచ్చారు. కాగా, పరీక్ష కేంద్రం బయట వేచి ఉండే తల్లిదండ్రులు కోసం షెల్టర్, కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.

# క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ పై కీలక సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపీ చామల

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : హైదరాబాద్ ఇందిరా భవన్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై పార్లమెంట్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ ఇంచార్జ్‌లతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై




నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో సచిన్ సావంత్ ఏఐసిసి కార్యదర్శి, అనిల్ కుమార్ యాదవ్ రాజ్యసభ సభ్యులు, మల్లు రవి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, రామసహాయం రఘురామిరెడ్డి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు,నగరిగారి ప్రీతమ్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్,టి. రామ్మోహన్ రెడ్డి పరిగి శాసనసభ సభ్యులు, శంకర్ నాయక్ శాసనమండలి సభ్యులు పార్లమెంట్ కోఆర్డినేటర్లు, ఇంచార్జ్‌లు నియోజకవర్గాల వారీగా ప్రజలతో మమేకమవుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో నాయకుల పాత్రపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలువురు పార్లమెంట్ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, కోఆర్డినేటర్లు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగతోనే సాధ్యం : పీసరి కృష్ణారెడ్డి

## బీజేపీ సిఎంసీ 295 బౌరంపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్, జూన్ 21, హైదరాబాద్ పల్స్ న్యూస్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బౌరంపేట డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో సింహపురి కాలనీ గణపతి పార్క్ లో యోగ దినోత్సవం నిర్వహించారు. యోగ శిక్షకులు కృష్ణారెడ్డి రాజేశ్వరి ప్రోటోకాల్ వివిధ ఆసనాలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటి సారి అంతర్జాతీయ స్థాయిలో యోగాను గుర్తింపు తేవడం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ఐక్యరాజ్యసమితిలో ప్రకటించడం జరిగింది. ఎందరో మహా ఋషులు మనులు యోగులు ప్రకృతిని ( పుష్పమైనటువంటి పద్మం పద్మాసన్, జలచరాలు మచ్యసన్, కూర్మాసన్, భూమి మీద నివసించే సర్పాసన్, గోముఖాస్సన్,) వృక్షాసన్ ఇలా ఎన్నో ప్రకృతినిమానవ శరీరంలో ఇనుమడింపజేసి మనిషిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వర్ధిల్లాలని తీర్చిదిద్దిన పురాతన సంపద యోగను గుర్తు చేసుకుని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. దినచర్యలో భాగంగా మనం మరి మన భావితరాలకు కూడా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది యోగాకు ప్రత్యేక గుర్తింపు వచ్చిన తర్వాత ప్రైవేటు మరియు ప్రభుత్వం తరఫున యోగా టీచర్లుగా ఎంతోమందికి జీవనోపాధి కూడా లభించడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గోనే మల్లారెడ్డి, డి. సీతారాం రెడ్డి, శివ ప్రసాద్, పరికి ప్రమోద్ కుమార్, నల్ల రాజిరెడ్డి, వై. శ్రీనివాస్ రెడ్డి,




అందే అశోక్, ఎం. అతీష్ బాబు, కొమ్ము ప్రశాంత్, బాలగారి శ్రీకాంత్, సాయికిరణ్, రామ్ కుమార్, సుధాకర్, బాలకృష్ణ సింహపురి కాలనీ అధ్యక్షులు నరసింహారెడ్డి కాలనీవాసులు మహిళలు భారీగా పాల్గొన్నారు.

# నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజాపాలన లక్ష్యం.....**

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మజూరి చేస్తున్నాం....**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన నక్క మహేష్ -- మధుశ్రీ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టుబట్టలు, యాట పొట్టేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కొత్త ఇంటిలో అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆయన ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం





చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. పేద కుటుంబాలు అద్దె ఇళ్లలో, తాత్కాలిక గృహాల్లో ఇబ్బందులు పడకుండా శాశ్వత గృహాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల అమలులో విశేష పురోగతి సాధించామని, రాష్ట్రవ్యాప్తంగా ఆలేరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇందుకు ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, ప్రభుత్వ సంకల్పమే కారణమన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబం సొంత ఇంటిలో ఆనందంగా జీవించే రోజులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పేదల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజపేటకు రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలి....

**ప్రభుత్వ నిర్లక్ష్యంతో మహిళలు, విద్యార్థులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు...**

**పేరుకే మహాలక్ష్మి పథకం.. బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు....**

**రాజపేట బిఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి ఆగ్రహం.....**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం కేవలం ప్రచారానికే పరిమితమైందని, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజపేట బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... యాదగిరిగుట్ట -- రాజపేట మార్గంలో గతంలో నడిచిన రెండు బస్సుల్లో ఒకదాన్ని రద్దు చేయడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు గంటల తరబడి బస్టాండ్‌లలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ఒకే బస్సు నడుస్తుండటంతో ప్రయాణికులు కిక్కిరిసిన పరిస్థితుల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే నిర్వహించిన ఫోన్-ఇన్ కార్యక్రమంలో సమస్యను వివరించేందుకు వందసార్లకు పైగా ఫోన్ చేసినా స్పందన లేదని, గంటల తరబడి వేచి చూసినా ప్రజల సమస్యలు వినేందుకు సమయం కేటాయించడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు




ప్రచార కార్యక్రమాలకే పరిమితమవుతున్నారని ఎద్దేవా చేశారు. గత మూడు నెలలుగా పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె అన్నారు. ఉచిత బస్సు పథకం పేరుతో ప్రజలను ఆకర్షించి, ఆ తరువాత సరిపడా బస్సులు నడపకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. బస్సు సౌకర్యం లేక మహిళలు, వృద్ధులు, విద్యార్థులు అధిక ఖర్చుతో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను వెంటనే గుర్తించి, యాదగిరిగుట్ట నుంచి రాజపేటకు గతంలో ఉన్నట్లుగానే రెండు బస్సులను యథావిధిగా నడపాలని ఎడ్ల బాలలక్ష్మి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..!

**- డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, ఝరాసంగం :** యోగాభ్యాసం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్, సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రమ వేద పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగం భారతీయ ఋషుల మహోన్నత వారసత్వమని, ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా శరీరం ఆరోగ్యవంతంగా, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. ఆశ్రమ నిర్వాహకులు, వేద పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నాయకుడు గుర్రం లక్ష్మారెడ్డి తండ్రికి ఎమ్మెల్యే కుంభం నివాళి...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి మండలం రెడ్ల రేపాక గ్రామ కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి తండ్రి రోడ్డు ప్రమాదంలో శనివారం రోజు మృతి చెందారు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మరియు పీసీసీ డెలిగేట్ తంగాళ్ళ పల్లి రవికుమార్, ఇతర కాంగ్రెస్ నాయకుల గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# టెలికాం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ డే

**యోగ లో పాల్గొన్న డివిజన్ బీజేపీ అధ్యక్షులు, వెల్ఫేర్ సభ్యులు**

**ఖానాజీగూడ, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా టెలికాం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెలికాం కాలనీలో నిర్వహించారు. ఈ యోగా కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గోగూరి శ్రీధర్ రెడ్డి కాలనీ వెల్ఫేర్ సభ్యులు మరియు కుటుంబ సభ్యులతో కలిసి యోగ సాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది సభ్యులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవనశైలికి తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పారు. యోగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం మరియు అంతరంగిక శాంతిని కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కార్యక్రమంలో టెలికాం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు, అలాగే పాల్గొన్నారు.






# రైతు పేరుతో బీఆర్ఎస్ అబద్ధాల ప్రచారం.!

**పదేళ్ల దోపిడీని కప్పిపుచ్చే కుట్ర**

**టిఆర్ఎస్ హయాంలో రైతు ఆగం**

**ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే**

**సహించేది లేదు**

**తిరుపతి చంటి మండల బీసీ సంఘం**

**కాంగ్రెస్ నాయకులు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :

పదేళ్లపాటు రైతులను నిలువునా దోచుకున్న బీఆర్ఎస్ పార్టీ, ఇప్పుడు రైతు పేరుతో అబద్ధాల ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం బూర్గంపహాడ్ మన భద్రాద్రి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ ప్రెస్ క్లబ్లో జరిగిన మీడియా సమావేశంలో వారు బీఆర్ఎస్ ఆరోపణలను ఖండించారు.

బీఆర్ఎస్ హయాంలోనే రైతు ఆగం...

కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకుని, మేడిగడ్డ కుంగిపోయేలా చేసింది ఎవరు? కమీషన్ల కోసం ప్రాజెక్టులను ఏటీఎంలుగా మార్చుకుంది ఎవరు? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు పేరుతో వడ్డీ వ్యాపారులకు, భూస్వాములకే లబ్ధి చేకూరిందని, కౌలు రైతులు, నిజమైన




సాగుదారులను గాలికొదిలేశారని ఆరోపించారు.

కాంగ్రెస్ హామీలు – నెరవేర్చిన వాస్తవాలు...

రైతుబంధును 15 వేలకు పెంచి 'రైతు భరోసా'గా మార్చాము. కౌలు రైతులకు కూడా ఏటా 15 వేలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్. ఇప్పటికే రెండు విడతలుగా నిధులు విడుదల చేశాం. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 2 లక్షల వరకూ రైతు రుణమాఫీ ఒకే విడతలో చేసి చూపించాం. 22 లక్షల మంది రైతులకు 18 వేల కోట్లు మాఫీ చేశాం. బీఆర్ఎస్ పదేళ్లలో చేసింది 29 వేల కోట్లే. 24 గంటల ఉచిత కరెంట్ యథాతథంగా కొనసాగిస్తున్నాం. రైతుడిస్కంలు అనేది బీఆర్ఎస్ సృష్టించిన అబద్ధం. నాణ్యమైన విద్యుత్ కోసం చర్యలు తీసుకుంటున్నాం.పంట కొనుగోలు మరియు బోనస్ గత సీజన్లో కేంద్రం ఇచ్చిన టార్గెట్కు మించి వడ్లు కొనుగోలు చేశాం. సన్న వడ్లకు క్వింటాల్కు 500 బోనస్ చెల్లిస్తున్నాం. వచ్చే సీజన్ నుంచి దశలవారీగా అన్ని రకాలకు బోనస్ విస్తరిస్తాం.రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన క్లెయిమ్లను కూడా మేమే పరిష్కరిస్తున్నాం.

బీఆర్ఎస్కు చిత్తశుద్ధి లేదు..

40 రకాలకు బోనస్ అని ఇప్పుడు డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్, పదేళ్లలో ఒక్క పంటకు కూడా బోనస్ ఇవ్వలేదు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అడిగిన ప్రశ్నలకే కేసీఆర్ అప్పుడు సమాధానం చెప్పలేదు. ధాన్యం కొనుగోలులో అవినీతి, మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దోచుకుంది బీఆర్ఎస్ ప్రభుత్వమే" అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

జంగ్ సైరన్ కాదు – ప్రగతి సైరన్...

బీఆర్ఎస్ ది జంగ్ సైరన్ కాదు, దోపిడీని కప్పిపుచ్చే సైరన్. కాంగ్రెస్ ది రైతు ప్రగతి సైరన్. 70 లక్షల మంది రైతులకు అండగా నిలబడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వారాల వేణు, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్ రెడ్డి,పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడమ కంతి సుధాకర్ రెడ్డి, మండల బీసీ సంఘం కాంగ్రెస్ నాయకులు తిరుపతి, మండల కాంగ్రెస్ ఎస్సీ సంఘం నాయకులు లాలయ్య పాల్గొన్నారు.

# మోతే అంగన్వాడి కేంద్రంపై వస్తున్న వార్తలు అవాస్తవం: గ్రామ ప్రజలు

**పౌష్టికాహారం సక్రమంగా**

**అందుతున్నదన్న తల్లులు**

**తప్పుడు కథనాలను ఖండించిన**

**ప్రజాప్రతినిధులు**

**12:40 గంటలకు కేంద్రానికి తాళం**

**వేసినట్లు ఆయా వివరణ**

**వారానికి ఒకసారి కేంద్రాన్ని**

**పర్యవేక్షిస్తున్న సూపర్వైజర్**

**వాస్తవాలు తెలుసుకుని వార్తలు**

**రాయాలని సూచన**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :

మోతే గ్రామంలోని అంగన్వాడి కేంద్రంపై ఇటీవల కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తలను ఖండిస్తూ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పిల్లల తల్లులు, గర్భిణీలు, బాలింతలు గ్రామ ప్రజలు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో ఎటువంటి సమస్యలు లేవని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు సక్రమంగా అమలవుతున్నాయని స్పష్టం చేశారు. పిల్లల తల్లులు మాట్లాడుతూ తమ పిల్లలకు ప్రతి నెలా బాలామృతం, చిక్కీలు, కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని తెలిపారు. అంగన్వాడి కేంద్రం ద్వారా పిల్లలకు




అవసరమైన సంరక్షణ, పోషకాహారం నిరంతరంగా అందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం గత 25 సంవత్సరాలుగా నిరంతరంగా సేవలు అందిస్తోందని తెలిపారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం, ఇతర సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయని చెప్పారు. కేంద్రంలో ఏవైనా సమస్యలు ఉంటే ప్రజాప్రతినిధులుగా తామే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అలాగే గ్రామస్తులు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాన్ని సంబంధిత సూపర్వైజర్ వారానికి ఒకసారి క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారని, కేంద్ర నిర్వహణ, సేవల అమలుపై నిరంతరం నిఘా ఉంటోందని తెలిపారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు కేంద్ర పనితీరును పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామానికి సంబంధం లేకుండా ఎక్కడి నుంచో వచ్చిన కొంతమంది మీడియా ప్రతినిధులు వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా, అంగన్వాడి సిబ్బంది లేదా ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా ఏకపక్షంగా వార్తలు ప్రచురించడం సరికాదని అన్నారు. వాస్తవాలను నిర్ధారించుకుని వార్తలు రాయడం మీడియా బాధ్యత అని, అవాస్తవ కథనాల వల్ల గ్రామ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రం మధ్యాహ్నం 12 గంటలకే మూసివేసినట్లు వచ్చిన వార్తల్లో ఎటువంటి నిజం లేదని కేంద్రంలో పనిచేస్తున్న ఆయా వివరించారు. శనివారం కావడంతో కేంద్రం పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచిన అనంతరం మధ్యాహ్నం 12:40 గంటలకు కేంద్రానికి తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. నేటి కేసరి, విశాల భారతి, ఎన్హెచ్–9 పత్రికల్లో ప్రచురితమైన వార్తలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. గ్రామంలో అంగన్వాడి సేవలు సజావుగా కొనసాగుతున్నాయని, అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. భవిష్యత్తులో గ్రామానికి చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా నిరాధార వార్తలు ప్రచురిస్తే చట్టపరంగా సంబంధిత అధికారులను ఆశ్రయించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో గ్రామ పెద్దలు, పిల్లల తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# డచ్ దరువు.. 5-1తో స్వీడన్పై ఘన విజయం

హోస్టన్: ప్రతిష్టాత్మక ఫిఫా ప్రపంచకప్లో జట్లన్నీ హోరాహోరీగా తలపడుతున్నాయి. నాకౌట్కు అర్హత సాధించాలంటే ప్రతి మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో జట్లు తుదికంటా పోరాడుతున్నాయి. ఆదివారం జరిగిన గ్రూపు–ఎఫ్ పోరులో నెదర్లాండ్స్ 5–1 తేడాతో స్వీడన్పై ఘన విజయం సాధించింది. తమ తొలి పోరును జపాన్తో 2–2తో డ్రా చేసుకున్న నెదర్లాండ్స్..మలి పోరులో విశ్వరూపం ప్రదర్శించింది. స్వీడన్పై భారీ విజయంతో గ్రూపులో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో దూసుకెళుతున్నది. స్వీడన్పై పోరులో అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన నెదర్లాండ్స్ టీమ్లో బ్రియాన్ బ్రాబె(5ని, 17ని), క్యాడె గప్కో(47ని, 54ని) డబుల్ గోల్స్తో విజృంభించగా, క్రిసెన్సియో సమర్విల్లె(89ని) మరో గోల్తో ఆకట్టుకున్నాడు. అంథోని ఎలంగ(59ని) స్వీడన్కు ఏకైక గోల్ అందించాడు. తమ తొలి పోరులో ట్యునీషియాను 5–1తో ఓడించిన స్వీడన్..నెదర్లాండ్స్పై పూర్తిగా తేలిపోయింది. 1950 ప్రపంచకప్లో బ్రెజిల్ చేతిలో 7–1 ఓటమి తర్వాత స్వీడన్కు ఇదే భారీ పరాజయం కావడం విశేషం. మ్యాచ్ విషయానికొస్తే ..పక్కా వ్యూహంతో బరిలోకి దిగిన డచ్ టీమ్ స్వీడన్పై ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ ఐదవ నిమిషంలోనే బ్రియాన్ గోల్తో నెదర్లాండ్స్ ఖాతా తెరిచింది. స్వీడన్ డిఫెన్స్ను కంగుతినిపిస్తూ గప్కో..పెనాల్టీ ఏరియాలో అందించిన బంతిని బ్రియాన్ అద్భుత రీతిలో గోల్గా మలిచాడు.



అదే ఊపు కొనసాగిస్తూ 12 నిమిషాల వ్యవధిలో బ్రియాన్ మరో గోల్తో విరుచుకుపడ్డాడు. డమ్ఫైర్స్ బంతిని అందుకున్న బ్రియాన్..అదే వేగంతో బంతిని గోల్పోస్ట్లోకి పంపడంతో డచ్ ఆధిక్యం 2–0కు చేరుకుంది. కీలకమైన ద్వితీయార్ధంలోనూ డచ్ దూకుడును ఎక్కడా తగ్గించలేదు.మ్యాచ్ మొదలైన రెండో నిమిషానికే గప్కో గోల్తో ఆధిక్యం 3–0కు చేరుకోగా, ఏడు నిమిషాల తేడాతో మరో గోల్తో చెలరేగడంతో డచ్కు తిరుగులేకుండాపోయింది. అప్పటికే మ్యాచ్ పట్టు కోల్పోయిన స్వీడన్కు ఎలంగ గోల్ ఒకింత ఊరటనిచ్చింది. మ్యాచ్ ఆఖరి క్షణాల్లో గోల్ చేసిన సమర్విల్లె..ఎన్బీఏ స్టార్ స్టెప్ కర్రీ 'నైట్ నైట్' అభివాదంతో ఫ్యాన్స్ను అలరించాడు. 68,777 మంది ప్రేక్షకులు హాజరైన ఈ మ్యాచ్ను డచ్ కింగ్ విలియమ్ అలెగ్జాండర్, క్వీన్ మాక్సిమా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ట్యునీషియాతో మ్యాచ్లో జపాన్ 4–0తో ఘన విజయం సాధించింది. అయాసె యుడా(31ని, 83ని) డబుల్ గోల్తో చెలరేగగా, డైచీ కమాడ(4ని), జున్య ఇటో(69ని) ఒక్కో గోల్ చేశారు.

# 28వ సారి చైర్మన్ గా గాల్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు అన్నదాత పాల సొసైటీ మదర్ డైరీ చైర్మన్ గా 28వసారి ఆర్కాల గాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో గాల్ రెడ్డిని మరోసారి చైర్మన్ గా ఎన్నుకొగా ధ్రువీకరణ పత్రం అందజేశారు. డైరెక్టర్లు పాడి రైతులు నాయకులు గాల్ రెడ్డిని అభినందించి సత్కరించారు.

# ఇసుక లారీల ట్రాఫిక్ జామ్తో... నీట్ పరీక్షకు దూరమైన మణుగూరు విద్యార్థిని





హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని ఎస్సార్ డిగ్రీ కళాశాల నీట్ పరీక్ష కేంద్రానికి మణుగూరుకు చెందిన విద్యార్థిని స్థిజ్ఞ ఒక నిమిషం ఆలస్యంగా చేరుకోవడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. దీంతో ఆమె పరీక్షకు హాజరు కాలేకపోయింది. మణుగూరు నుంచి కొత్తగూడెం వస్తున్న సమయంలో ఇసుక లారీల రద్దీ కారణంగా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ఆలస్యమైందని విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. ఎంతోకాలంగా పరీక్ష కోసం సిద్ధమయ్యానని, కేవలం ఒక నిమిషం ఆలస్యం వల్ల అవకాశం కోల్పోవడం బాధాకరమని కన్నీటి పర్యంతమైంది. ట్రాఫిక్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఆమె కోరింది.

# టి.పి.ఎస్.యు ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ.....




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టి.పి.ఎస్.యు) ఆధ్వర్యంలో తేదీ 26-06-2026 శుక్రవారం ఉదయం 9:30 గంటలకు స్వకుల సాళి సమాజ భవనం ఎల్బీనగర్ హైదరాబాద్ లో జరగబోయే తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించడమైనది. ఇట్టి సదస్సుకు జిల్లా పద్మశాలి ఉద్యోగులందరూ తప్పకుండ హాజరై రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, పెండెం శ్రీనివాస్ నేత, ప్రధాన కార్యదర్శి రచ్చ గణేష్ ప్రసాద్ నేత, ఆర్గనైజిశీగ్ సెక్రటరీ గంజి నాగేశ్వర్ రావు నేత, కార్యవర్గ సభ్యులు మీన సురేందర్ నేత, రాపోలు సోమేశ్వర్ నేత, స్వర్గం జనార్దన్ నేత, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# రాజపేటలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు....

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రాజపేట గురుకుల విద్యాలయంలో



బిజెపి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల బిజెపి పార్టీ అధ్యక్షులు మేకల రమేష్, రాజపేట సర్పంచ్ కోయ మధు, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు సాదనబోయిన శంకర్, చల్మలపల్లి లక్ష్మణ్, మెండు భగవాన్ రెడ్డి, బూర్గు శేఖర్ రెడ్డి, సంగెం వేణు తదితరులున్నారు.

## జై శ్రీమన్నారాయణ భక్త బృందం సామూహిక పారాయణం...



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం శనివారం రాత్రి సామూహిక సహస్ర పారాయణం చేశారు. దేవత మూర్తుల యందు గోవింద నామాలు, లలిత సహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. ఈ కార్యక్రమంలో పుష్ప, నంగునూరు జగదవ్వ, పెంట రజిత, చామకూర అరుణ, బిర్రు భాగ్యలక్ష్మి, బోగలత తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్

**జానారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్..**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : మాజీ మంత్రివర్యులు, సీనియర్ కాంగ్రెస్ నేత, ప్రభుత్వ సలహాదారు కుందూరు జానారెడ్డి జన్మదినం సందర్భంగా భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ దంపతులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నజీర్ బాయ్, తంగళ్లపల్లి సురేష్ కుమార్, కూర శివకుమార్, మహమ్మద్ రఫీ ఉద్దీన్ గోరి, గుమ్మిడేల్లి రమేష్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి నగర్ నూతన కార్య వర్గం ఎన్నిక

**కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముద్దం నరసింహ యాదవ్.**





ఆర్.ఆర్.నగర్, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
రాజ రాజేశ్వరి నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్ నెం. 10లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కమిటీ సభ్యులను ముద్దం నర్సింహ యాదవ్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన అధ్యక్షుడిగా ఎస్.చక్రపాణి, జనరల్ సెక్రటరీలుగా శ్రీనివాసరావు, మీనాక్షి పవర్, జాయింట్ సెక్రటరీలుగా బిట్ల వెంకటేశ్వరరావు, సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అమర్ సింగ్,ట్రెజరర్‌గా దిలీప్ రాజన్ తో పాటు 11 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, రాజరాజేశ్వరి నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా ముద్దం నర్సింహ యాదవ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అడ్వైజర్స్‌లుగా వెంకటపతి రాజు, బాబు ఓడినే, కృష్ణారెడ్డి ఉన్నారు.

హైదరాబాద్ పల్స్

## వాహనదారులకు కీలక అలెర్ట్..మొబైల్ నంబర్ అప్డేట్ చెయ్యకుంటే మీకు తిప్పలే!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలోని వాహనదారులందరికీ రవాణాశాఖ ముఖ్యమైన హెచ్చరికను జారీ చేసింది. ఈ-చలాన్లు, కోర్టు నోటీసులు, ఆర్టీఏ సమాచారం వంటి ముఖ్యమైన అధికారిక సందేశాలను సకాలంలో అందుకోవాలంటే వాహన్ పోర్టల్‌లో తమ లేటెస్ట్ మొబైల్ నంబర్ మరియు ఈమెయిల్ ఐడీని తక్షణమే అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ఈ వివరాలు అప్‌డేట్ చేయకపోతే పెండింగ్ జరిమానాలు పేరుకుపోయి, భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

**వాహన్ పోర్టల్‌లో మొబైల్, ఈమెయిల్ అప్డేషన్ పై అలెర్ట్**

చాలామంది వాహనాలు కొనుగోలు చేసినప్పుడు ఇచ్చిన పాత మొబైల్ నంబర్లు లేదా ఈమెయిల్ ఐడీలు ఇప్పటికీ వాహన్ డేటాబేస్‌లోనే ఉండిపోతున్నాయి. కాలక్రమేణా సిమ్ నంబర్లు మారినా, కొత్త ఈమెయిల్ ఐడీలు తీసుకున్నా వాటిని అప్‌డేట్ చేయడం లేదు. దీంతో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన ఈ-చలాన్లు, వాహన ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ బదిలీలు, కోర్టు సమన్స్ వంటి ముఖ్యమైన సమాచారం పాత



నంబర్లకు వెళ్తోంది.

**ఇన్ఫర్మేషన్ అందలేదంటే చెల్లదన్న అధికారులు**

ఫలితంగా వాహన యజమానులు తమపై ఎన్ని జరిమానాలు పడ్డాయో కూడా తెలియకుండా పోతున్నారు. రవాణాశాఖ అధికారుల ప్రకారం, వాహన్ పోర్టల్‌లో నమోదైన కాంటాక్ట్ వివరాలకు పంపిన ఏ సందేశమైనా చట్టపరంగా వాహన యజమానికి అందినట్లుగానే పరిగణించబడుతుంది. "నోటీసులు రాలేదు", "పాత నంబర్ పని చేయడం లేదు" అనే వాదనలు కోర్టులోనో, ఇతర అధికారిక వేదికల ముందో చెల్లవని అధికారులు తేల్చి చెప్పారు.

**వాహన్ అధికారిక వెబ్‌సైట్ లో మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ మస్ట్**

ఈ నిర్లక్ష్యం వల్ల పెండింగ్ ఫైన్లు పేరుకుపోవడమే కాకుండా వాహన బదిలీలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరణ వంటి పనుల్లో తీవ్రసమస్యలు తలెత్తవచ్చు. ఈ సమస్యను పరిష్కరించడానికి వాహనదారులు సులభంగా వాహన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి తమ వాహన నంబర్ ద్వారా లాగిన్ అయి కొత్త మొబైల్ నంబర్ మరియు ఈమెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇంకా సులభంగా చేయాలని రవాణాశాఖ ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను కూడా విడుదల చేసింది.

**కోడ్‌ను స్కాన్ చేసి అప్డేట్ చేసుకోవచ్చు**

స్మార్ట్‌ఫోన్‌తో ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుంది. తెలంగాణ రవాణా శాఖ ఈ చర్య ద్వారా డిజిటల్ సేవలను మరింత ప్రభావవంతంగా అందించాలని భావిస్తోంది. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ వివరాలను సరిచేసుకోవాలని ప్రభుత్వం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఈ చిన్న అప్‌డేట్ వల్ల భవిష్యత్తులో అనవసరమైన ఇబ్బందులు, ఆర్థిక నష్టాలను నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి డిజిటల్ అప్‌డేట్‌లు వాహన సంబంధిత సేవలను మరింత సులభం చేస్తాయి.

## మహిళల ఆర్థిక... సామాజిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమామే లక్ష్యంగా అనేక అభివృద్ధి, కార్యక్రమాలు....**

**తుర్కపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య....**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తుర్కపల్లి మండలంలోని బీల్యా నాయక్ తండ, మాదాపురం, రుస్తాపురం, రాంపురం, తిరుమలపురం, గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడే విధంగా మహిళా సంఘం భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకమని, వారి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ముల్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు పట్టు బట్టలు



అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ యాట పొట్టేళ్లను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని



పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల సాధికారత, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. మహిళా సంఘాల భవనాలు నిర్మాణం పూర్తయిన తర్వాత సంఘాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, గ్రామస్థులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్ రీ-ఎగ్జామ్ విద్యార్థుల కోసం "ప్రధాని మోడీ" షాకింగ్ నిర్ణయం..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, సెంట్రల్ బ్యూరో:
నీట్ యూజీ రీ-ఎగ్జామ్ రాస్తున్న అభ్యర్థులకు ట్రాఫిక్ ఆంక్షల వల్ల ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో తన ప్రయాణాన్ని కొంతసేపు వాయిదా వేసుకున్నారు. కోల్‌కతా పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత ఆయన వెంటనే లోక్ కల్యాణ్ మార్గ్‌లోని నివాసానికి వెళ్లలేదు.

**విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం**

ప్రధాని మధ్యాహ్నం సుమారు 1.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే రోజు నీట్ రీ-ఎగ్జామ్ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండటంతో, పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థుల రాకపోకలకు ఆటంకం కలగకూడదని ఆయన విమానాశ్రయంలోనే వేచి ఉన్నారు.

**నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో ట్రాఫిక్‌పై జాగ్రత్త**



ప్రధాని కదలికల సమయంలో సాధారణంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా కొన్ని మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణలు ఉంటాయి. పరీక్ష సమయం దగ్గరగా ఉన్నప్పుడు అలాంటి ఆంక్షలు విద్యార్థులపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో, పరీక్ష ప్రారంభమైన తర్వాతే నివాసానికి బయలుదేరాలని నిర్ణయించినట్లు వర్గాలు తెలిపాయి. నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా వైద్య అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష కీలకం. మే 3న నిర్వహించిన పరీక్ష ప్రశ్నపత్రాల లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేయబడగా, ఆదివారం మళ్లీ పరీక్ష నిర్వహిస్తున్నారు. రీ-ఎగ్జామ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరుగుతోంది. భారత్‌లోని 551 నగరాల్లో 5,440 కేంద్రాలు, విదేశాల్లో 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభ్యర్థులు పాల్గొనే పరీక్ష కావడంతో, పరీక్షా కేంద్రాల వద్ద సమయపాలన, రాకపోకలు అత్యంత కీలకంగా మారాయి. మోదీ ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో రెండు రోజుల పర్యటన పూర్తి చేసుకుని ఢిల్లీకి తిరిగి వచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. పరీక్షల సమయంలో భద్రతా ఏర్పాట్లు, ప్రజా రవాణా మధ్య సమతుల్యత ఎంత అవసరమో ఈ పరిణామం మరోసారి గుర్తు చేసింది.

## ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుకు కార్యాచరణ

***కో-ఆర్డినేటర్లు, సూపర్‌వైజర్ల నియామించిన ఎమ్మెల్యే శ్రీగణేష్***

పికెట్, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : ఎలక్షన్ కమిషన్ తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో పకడ్బందీగా అమలు చేసేందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని 231 పోలింగ్ బూత్‌లకు అనుభవజ్ఞులైన బద్రీనాథ్ యాదవ్,సంకి రవీందర్లను కో-ఆర్డినేటర్లుగా,ప్రతి 10 పోలింగ్ బూత్‌లకు ఒకరు చొప్పున 23 మంది క్రియాశీల నాయకులను సూపర్‌వైజర్లుగా నియమించారు. ఆదివారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కో-ఆర్డినేటర్లు, సూపర్‌వైజర్లతో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలని, ఒక్క అర్హుడి ఓటు హక్కు కూడా వృథా కాకూడదని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో విజయవంతం చేసి, 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు.



# కమ్ముకొస్తున్న కరువు.. దేశాన్ని వణికిస్తున్న తాజా వాతావరణ నివేదిక!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, తెలంగాణ బ్యూరో:
దేశవ్యాప్తంగా రైతాంగాన్ని, ఆర్థిక రంగాన్ని నైరుతి రుతుపవనాల గమనం తీవ్ర ఆందోళనలోకి నెట్టేస్తోంది. ఈ ఏడాది (2026) ఆరంభంలో రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినప్పటికీ, వాటి ముందడుగు మాత్రం చాలా బలహీనంగా సాగుతోంది. దీని ప్రభావం దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా కనిపిస్తోందని '360 వన్ క్యాపిటల్ రీసెర్చ్' తన తాజా పరిశోధనా నివేదికలో హెచ్చరించింది.గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఖరీఫ్ సాగు ఊసే లేకుండా పోయిందని, వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. ఒకవేళ ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడంతో పాటు ఆహార సంక్షోభం ఏర్పడి నిత్యావసరాల ధరలు చుక్కలు చూసే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది.

గణాంకాల్లో 'వర్షపాత లోటు'.. 66 శాతం జిల్లాల్లో కరువు ఛాయలు!

నివేదిక ప్రకారం జూన్ 17 నాటికి దేశవ్యాప్తంగా సగటున 74.3 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా.. కేవలం 46.2 మి.మీ మాత్రమే నమోదైంది. అంటే ఏకంగా 38 శాతం వర్షపాత లోటు నెలకొంది. జూన్ 17తో ముగిసిన వారంలో సాధారణం కంటే 48 శాతం తక్కువ వర్షం పడింది.భారతదేశంలోని మొత్తం 36 వాతావరణ సబ్ డివిజన్లలో 22 డివిజన్లు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొంటున్నాయి. జిల్లా స్థాయి పరిశీలనలోకి వెళ్తే.. దేశంలోని సుమారు 66 శాతం జిల్లాల్లో అతి తక్కువ లేదా లోటు వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా మధ్య భారతదేశంలో 62 శాతం, తూర్పు భారతదేశంలో 44 శాతం మేర సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

పత్తి, పప్పుధాన్యాల సాగు కుదేలు.. వరి ఒక్కటే సేఫ్!


రుతుపవనాల జాప్యం దేశవ్యాప్తంగా పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. జూన్ 12 నాటికి మొత్తం ఖరీఫ్ సాగు విస్తీర్ణం 84.6 లక్షల హెక్టార్లుగా నమోదైంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 3.9 శాతం తక్కువ.

పప్పుధాన్యాలు అండ్ పత్తి: వర్షాలు లేకపోవడంతో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం ఏకంగా 43.2 శాతం పడిపోయింది. అలాగే తెల్ల బంగారంగా పిలిచే పత్తి సాగు కూడా 28 శాతం మేర క్షీణించింది.

వరి సాగు: అయితే, గత ఏడాది నమోదైన తక్కువ బేస్ కారణంగా వరి సాగు విస్తీర్ణం మాత్రం వార్షిక ప్రాతిపదికన 28.4 శాతం వృద్ధిని కనబర్చడం కొంత ఉపశమనం కలిగించే అంశం.

జలాశయాల్లో నీరు ఉంది.. కానీ జూలై, ఆగస్టు నెలే కీలకం!

ప్రస్తుతం వర్షాలు లేకపోయినా దేశంలోని ప్రధాన జలాశయాల్లో (డ్యామ్‌లలో) నీటి నిల్వలు మెరుగ్గా ఉండటం ఒక సానుకూల అంశం. జూన్ 11 నాటికి డ్యామ్‌లలో లైవ్ స్టోరేజ్ సామర్థ్యం 28.3 శాతంగా ఉంది. ఇది గత 10 ఏళ్ల సగటు నిల్వ కంటే 16 శాతం ఎక్కువ. అందువల్ల తక్షణ సాగునీటి అవసరాలకు ఈ నీరు ఒక బఫర్‌లా (రక్షణ కవచం) ఉపయోగపడనుంది.కానీ, రాబోయే జూలై, ఆగస్టు నెలలు భారతదేశ వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమని '360 వన్ క్యాపిటల్ రీసెర్చ్' తెలిపింది. ఎందుకంటే దేశానికి కావలసిన అత్యధిక వర్షపాతం ఈ రెండు నెలల్లోనే కురుస్తుంది. ఈ సమయంలో గనుక రుతుపవనాలు పుంజుకుంటే పంటలు కోలుకుంటాయని, లేనిపక్షంలో ఆహార ద్రవ్యోల్బణం పెరిగి, గ్రామీణ ప్రజల ఆదాయాలు దారుణంగా పడిపోతాయని నివేదిక హెచ్చరించింది. ప్రభుత్వం, నిపుణులు ఈ రుతుపవనాల గమనాన్ని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




# మహాసముద్రంలో "ఐఎన్ఎస్" త్రిశూల వ్యూహం.. అమ్ములపొదిలో సరికొత్త అస్త్రాలు!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, సెంట్రల్ డెస్క్ :
భారత రక్షణ రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖితమైంది. సముద్ర గర్భంలో శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించేందుకు, భారత జలాలపై తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ఒకేసారి మూడు అత్యాధునిక స్వదేశీ యుద్ధనౌకలు భారత నౌకాదళం (ఇండియన్ నేవీ) లోకి ప్రవేశించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూడు యుద్ధనౌకలను జాతికి అంకితం చేశారు.ఇందులో అడ్వాన్స్‌డ్ స్టెల్త్ ఫ్రిగేట్ 'ఐఎన్ఎస్ దూనగిరి', లార్జ్ సర్వే వెసల్ 'ఐఎన్ఎస్ సంశోధక్', యాంటీ సబ్‌మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్ 'ఐఎన్ఎస్ అగ్రయ్' ఉన్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ ఫ్రంట్‌లైన్ నౌకల చేరికతో భారత నావికాదళ పోరాట పటిమ, సముద్ర రక్షణ సామర్థ్యం అసాధారణంగా పెరగనుంది.

కోల్‌కతా జీఆర్ఎస్ఈ అద్భుత సృష్టి.. శత్రువులకు సింహస్వప్నం!

ఇండియన్ నేవీకి చెందిన 'వార్‌షిప్ డిజైన్ బ్యూరో' రూపకల్పన చేయగా.. కోల్‌కతాకు చెందిన ప్రముఖ రక్షణ రంగ ప్రభుత్వ సంస్థ 'గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్' ఈ మూడు నౌకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. నౌకాదళ బ్యాలెన్స్‌డ్ అప్రోచ్‌కు అద్దం పట్టేలా నిర్మితమైన ఈ మూడు నౌకలు సముద్ర పోరాటాలు, హైడ్రోగ్రాఫిక్ సర్వేలు, , జలాంతర్గామి నిరోధక చర్యల్లో కీలక పాత్ర పోషించనున్నాయి.




ఐఎన్ఎస్ దూనగిరి :

ఇది 'ప్రాజెక్ట్ 17ఎ' కింద తయారైన ఐదో స్టెల్త్ ఫ్రిగేట్. శత్రువుల రాడార్లకు చిక్కకుండా దూసుకెళ్లే ఈ నౌకలో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ ఉపరితలం -నుంచి-ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులు, అలాగే మీడియం రేంజ్ ఉపరితలం-నుండి-గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థలను అమర్చారు. ఇది నేవీ ఫైటింగ్ కెపాసిటీని ఊహించని స్థాయికి తీసుకెళ్తుంది.

ఐఎన్ఎస్ సంశోధక్ :

నాల్గవ లార్జ్ సర్వే వెసల్ అయిన ఈ నౌక తీరప్రాంతం , లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి ఉపయోగపడుతుంది. రక్షణ, పౌర అవసరాల కోసం సముద్రగర్భ సమాచారాన్ని సేకరించేందుకు ఇందులో అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన సిస్టమ్స్ ఉన్నాయి.

ఐఎన్ఎస్ అగ్రయ్ :

'అర్ణాల' క్లాస్‌కు చెందిన ఈ నాల్గవ యాంటీ-సబ్‌మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్ తక్కువ లోతు ఉండే తీర ప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను వేటాడటంలో దిట్ట. ఇందులో తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, షాలో-వాటర్ సోనార్ వ్యవస్థలు ఉన్నాయి.

75 శాతం స్వదేశీ పరిజ్ఞానం..

200 పైగా ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం, ఈ మూడు యుద్ధనౌకల కమిషనింగ్ ద్వారా భారతదేశపు 'ఆత్మనిర్భర్ భారత్' (స్వయంసమృద్ధి) సంకల్పం మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది. ఈ నౌకల నిర్మాణంలో వాడిన పరికరాలు, సాంకేతికతలో 75 శాతానికి పైగా పూర్తిగా స్వదేశీ కంటెంట్ కావడం విశేషం. మన దేశీయ రక్షణ పర్యావరణ వ్యవస్థ ఎదుగుదలకు ఇది నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.ఈ భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో భారతీయ పరిశ్రమలతో పాటు ముఖ్యంగా 200కు పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు చురుగ్గా పాల్గొన్నాయి. తద్వారా దేశంలో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించాయి. భారత ప్రభుత్వం, ఇండియన్ నేవీ, పబ్లిక్ సెక్టార్ షిప్‌యార్డులు , ప్రైవేట్ పరిశ్రమల సమష్టి కృషికి ఈ మూడు సరికొత్త నౌకల కమిషనింగ్ ఒక అద్భుతమైన మైలురాయి అని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి.

# హామీలిచ్చుడే తప్పు..ఎప్పుడైనా నెరవేర్చారా? : రాంచందర్ రావు

### సీఎం రేవంత్‌కు లేఖ రాసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, తెలంగాణ బ్యూరో :
కాంగ్రెస్ అంటే హామీలు ఇచ్చుడే తప్పా.. వాటిని తీర్చేది లేదని బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఆయనకు గుర్తు చేసి అమలు చేయాలని అడుగుతానన్నారు. 2023 ఎన్నికల సందర్భంగా వారు ఇక్కడికి వచ్చి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఈమేరకు ఆదివారం సీఎం రేవంత్‌కు రాంచందర్‌రావు లేఖ రాశారు.2023 ఎన్నికల్లో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ స్వయంగా తెలంగాణకు వచ్చి ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి? ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులైనా హామీలను నెరవేర్చరా? మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 ఇస్తామని మాటిచ్చారు. విద్యార్థులకు విద్యా భరోసా కింద రూ.5 లక్షల సాయం, నిరుద్యోగులకు రూ.4,000 భృతి అతీగతీ లేదు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఊసే లేదు. ఇలా ప్రతి వర్గానికి అన్యాయం చేశారు అని బీజేపీ రాష్ట్ర చీఫ్ విమర్శించారు.

వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి అందిస్తామన్న రూ.12,000 హామీ ఏమైంది. లక్షలాది పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ వారు ఎదురుచూస్తూనే ఉన్నారు. విద్యా భరోసా కింద రూ. 5 లక్షలు సాయం చేస్తామని చెప్పారు. అది ఇంకా అమలు చేయనేలేదు. ఫీజు రీయింబర్స్ మెంట్ అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నిరుద్యోగ భృతి రూ.4000 ఇస్తామని రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు. కానీ అప్పుడే మరిచిపోయారు. కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చేటప్పుడు తప్పు.. తీర్చేటప్పుడు పత్తా లేరా? అని ఆయన లేఖలో ఎద్దేవా చేశారు.

కాలేజీ పిల్లలకు స్కూటీలు ఇస్తామని చెప్పారు. నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ వేస్తామని మోసం చేశారు. ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను వంచించారు. రూ.500 బోనస్ ఇస్తామని ఎగ్గొట్టారు. రాహుల్ గాంధీ జవాబుదారీతనంగా ఉంటామని మాట మార్చారు. వెంటనే ఆరు గ్యారంటీలు అమలయ్యేలా ఆయన చొరవ తీసుకోవాలి.



ఇచ్చిన హామీలు మరవడమే కాకుండా విదేశాల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు.

తెలంగాణ ప్రజల తరఫున వారితో నేను మాట్లాడతాను

నాకు అవకాశం కల్పిస్తే ఇచ్చిన హామీలను రాహుల్‌కు గుర్తు చేస్తా. ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం భయపడితే.. అది తెలంగాణ ప్రజలను వారు ఘోరంగా వంచించారని ఒప్పుకున్నట్లే. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నెరవేరని వాగ్దానాలపై రాహుల్ గాంధీకి వినతిపత్రం ఇచ్చేందుకు సీఎం రేవంత్ అపాయింట్‌మెంట్ ఇప్పించాలి అని రాంచందర్‌రావు బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు.

# బొల్లారంలో ఘనంగా ముగిసిన ఫుట్‌బాల్ ఛాలెంజింగ్ కప్

### లివిజేతలకు ట్రోఫీ అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్




బొల్లారం, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సి.ఆర్.ఎం.జి గ్రౌండ్స్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించిన ఫుట్‌బాల్ ఛాలెంజింగ్ కప్ టోర్నమెంట్ ఆదివారం ఫైనల్ మ్యాచ్‌తో ఘనంగా ముగిసింది.ఫైనల్ మ్యాచ్‌కు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, బహుమతులు ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రన్నరప్ టీమ్‌ను కూడా మనస్ఫూర్తిగా అభినందించి, మీ పోరాట స్ఫూర్తి అమోఘమని ప్రశంసించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఇంత గొప్ప టోర్నమెంట్ నిర్వహించిన బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ నిర్వాహకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతం నుంచి రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులు తయారవ్వాలని, అందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, క్రీడాకారులకు కావలసిన మౌలిక వసతులు, శిక్షణ, ప్రోత్సాహం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు నరసింహన్ కన్నన్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, అరవింద్,వినోద్, భరత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భార్యాభర్తల గొడవ.. పిల్లలకు ఎలుకల మందు తినిపించిన తల్లి



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, ఖమ్మం జిల్లా :
ఖమ్మంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవ ఏకంగా పిలల్ల ప్రాణాలనే బలిగొంది. ఇద్దరు కుమారులకు ఎలుకల మందు తినిపించి ఆపై తల్లి ఆత్మహత్యాయత్నం చేసిన ఉదంతం నగరంలోని పంపింగ్ వెల్ రోడ్‌లో వెలుగుచూసింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా స్థానికంగా విషాద చాయలు అలుముకున్నాయి.పోలీసుల ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఏదిలాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడుకు చెందిన బొబ్బాల లింగరాజుతో చింతకాని మండలం నరసింహపురానికి చెందిన స్వాతికి 9 ఏళ్ల క్రితం వివాహమైంది. లింగరాజు కుటుంబ పోషణ కోసం పాల వ్యాపారం చేస్తూనే ఖమ్మంలోని మొబైల్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఏడాది నుంచి ఖమ్మం నగరంలోని పంపింగ్ వెల్ రోడ్‌లోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు.ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో శనివారం సాయంత్రం ఇద్దరు కుమారులకు ఎలుకల మందు తినిపించి తల్లి స్వాతి కూడా తాగింది. వెంటనే స్థానికులు గమనించి ముగ్గురినీ ఆసుపత్రికి తరలించారు. కుమారులు వేదిక్ (7), తనుష్ (5) మృతి చెందారు. తల్లి చికిత్స పొందుతుండగా ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అని పోలీసులు తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం పంపిణీ...

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బేగంపేట గ్రామంలో ఇటీవల మరణించిన కొత్తపల్లి బుచ్చమ్మ కుటుంబానికి బేగంపేట గ్రామ సర్పంచ్ ఇశీడ్ల అనుష సుమన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట సత్తయ్య, వార్డు సభ్యులు జిల్లా భాస్కర్, ప్యాట నరేష్, చిగుర్ల గణేష్, చింతగారి రమేష్, కొత్తపెల్లి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఘనంగా కరాటే విద్యార్థుల యోగా ప్రదర్శన

**మాస్టర్ శివకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహణ**



హైదరాబాద్ పల్స్, జూన్ 21, షాద్నగర్ నియోజకవర్గం : ఆదివారం నాడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా, 'జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా – షోటో కన్ కరాటే అకాడమీ', తిమ్మాపూర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శివ కృష్ణ గౌడ్ నేతృత్వంలో విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలను, ప్రాణాయామ పద్ధతులను క్రమశిక్షణతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శివ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ, "శారీరక దృఢత్వానికి కరాటే ఎంత ముఖ్యమో, మానసిక ప్రశాంతతకు మరియు ఏకాగ్రతకు యోగా అంతకంటే ముఖ్యం. క్రమశిక్షణతో కూడిన కరాటే అభ్యాసానికి యోగా తోడైతే విద్యార్థులు తమ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా చేరుకుంటారని అన్నారు. ముఖ్యంగా తమ అకాడమీ విద్యార్థులలోని చురుకుదనాన్ని, ఏకాగ్రతను పెంచడానికి యోగా ఎంతో దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. మరియు పలు విధమైన యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధనలో పాల్గొన్న కొంపల్లి బీజేపీ నాయకులు

**కొంపల్లి డివిజన్ అధ్యక్షులు బీజేపీ పెద్దబుద్ధుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో**



**కొంపల్లి, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేడు కొంపల్లి ఎ.ఎమ్.ఆర్ గార్డెన్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యోగా అభ్యాస వర్గలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డితో కలసి పాల్గొన్నాను. భారతీయ సాంస్కృతిక సంపదలో యోగ సాధన అగ్రభాగాన నిలుస్తుంది. శారీరక మరియు మానసిక దృఢత్వానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందని గుర్తించి 21 జూన్ అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ కార్యక్రమంలో అజయ్ కేసరి, మధుసూదన్ రెడ్డి,సాయన్న, వెంకటేశ్వర రావు, గోపాల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, శంకర్ నాయక్, పెంటరెడ్డి, ఉప్పరి మహేందర్, మురళీధర్ రెడ్డి,బలరాం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బాపి రెడ్డి, సంతోష్ రెడ్డి, చంద్రశేఖర్, మహిపాల్ రెడ్డి, సంజయ్ సింగ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు సినీ నిర్మాత ఇక లేరు

**ఆరోగ్య సమస్యలతో మరణించిన గొట్టి ముక్కల పద్మారావు కుటుంబాన్ని పరామర్శించిన ముద్దం నరసింహ యాదవ్**



కూకట్పల్లి, జూన్ 21,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి ) ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ గొట్టిముక్కల పద్మారావు పార్థివదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మారావు సమాజ సేవలో చూపిన నిబద్ధత, వారి ఆత్మీయత ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హరినాథ్,ఏడుకొండలు, మట్టి శ్రీనివాస్,బుర్రి యాదగిరి,పిట్ల రాజు, రాజు గౌడ్, శ్యాంసుందర్, శ్రీశైలం చారి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# మచ్చ బొల్లారం రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలన

**పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్, కాంగ్రెస్ నాయకులు**

మచ్చ బొల్లారం, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
అల్వాల్, మచ్చ బొల్లారంలోని సుచిత్ర, లయోలా కాలేజ్, ఇందిరా గాంధీ విగ్రహం అల్వాల్ సెలెక్ట్ టాకీస్ నుండి రాజీవ్ రహదారి వెళ్లే రోడ్డును సంధానించే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే మచ్చ బొల్లారం, అల్వాల్, సుచిత్రతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. అలాగే ట్రాఫిక్ రద్దీ సమస్యకు కూడా గణనీయమైన ఉపశమనం లభించనుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఈ కీలక ప్రాజెక్టును ప్రారంభించడంలో సహకరించిన రైల్వే అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు త్వరలోనే ముగింపు పలకనున్న ఈ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, లడ్డు రెడ్డి, శ్రీశైలం యాదవ్, సంపత్ యాదవ్, వెంకటేష్ గౌడ్, రాజేందర్ యాదవ్, రమేష్, ఆనంద్, కొండల్ రెడ్డి, డి. స్వామి, శంకర్, నవీన్, శ్రీను, నరేష్ రెడ్డి, సందీప్ రెడ్డి, సురేందర్, దేవా, బబ్లు తదితరులు పాల్గొన్నారు.



# శారీరక, మానసిక ఆరోగ్యానికి మూలాధారమే యోగా సాధన : ముద్దం

**డివిజన్లోని వివిధ యోగా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్**


ఓల్డ్ బోయిన్పల్లి, జూన్ 21, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఓల్డ్ బోయిన్‌పల్లి 262 డివిజన్ పరిధిలోని రాజ రాజేశ్వరి నగర్ హెచ్.ఎ.ఏల్ పార్క్ లో, సమతా నగర్ పీవీ ఎన్క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో, ముద్దం నరసింహ యాదవ్ స్వగృహంలో వివిధ కాలనీ సభ్యులతో నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి మూలాధారం అని పేర్కొన్నారు. ప్రస్తుతం వేగ వంతమైన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి, మనసుకు ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం యోగా సభ్యులు ముద్దం నర్సింహ యాదవ్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో యోగా గురువులు లక్ష్మణ్, రాజయ్య, మెరుగు మల్లికార్జున్, సంజీవ రాయుడు, కిరణ్ కుమార్ గౌడ్, లింగన్న, ఎడ్ల ప్రభాకర్, సంతోష్ శర్మ, మహేష్ శర్మ, సిద్దిరాం రెడ్డి, శీను ముదిరాజ్, భరత్, ప్రమోద్, చందులాల్, చారి, హరి, నారాయణ, శ్రీకాంత్, రత్నాకర్ రెడ్డి, బండి శ్రీను, విజయ్ కుమార్, అలాగే భారత్ ఫిట్‌నెస్ హబ్ సభ్యులు, సుధాకర్ రావు, సూర్యప్రకాష్, రాజలింగం, ప్రేమ్‌రాజ్, శేషగిరిరావు, శ్యామ్‌సుందర్, బాలరాజ్, జంగయ్య, సూర్యనారాయణ, రాధారాణి కుటుంబ సభ్యులు, వాసవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల అశోక్ గుప్తా,హెచ్.ఎ.ఏల్ కాలనీ ప్రెసిడెంట్ రాంబాబు, రాజ రాజేశ్వరి నగర్ జనరల్ సెక్రటరీ చక్రపాణి, వాకర్ సీనియర్ సభ్యుడు శోభన్ బాబు, శైలనూరి హరిబాబు



చారి ,ఎస్. నారాయణ్, వినోద్ కుమార్, గౌరీ శంకర్, సంతోష్ కుమార్ పూదరి, రేఖ గోయల్, అరుణ, ధనలక్ష్మి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముంబయిలో కరోనా కలకలం.. మళ్లీ విజృంబిస్తున్న వైరస్‌లు..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, సెంట్రల్ డెస్క్ :
వర్షాకాలం నేపథ్యంలో ముంబయి మహానగరంలో మళ్లీ వైరల్ వ్యాధులు విజృంబిస్తున్నాయి. ఇటీవల కొంతకాలంగా కొవిడ్-19, స్వైన్ ఫ్లూ, ఇన్‌ఫ్లుయెంజా తదితర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ కేసులు భారీగా పెరిగాయి. రెస్పిరేటరీ సింకీషియల్ వైరస్ కేసులు ఒకేసారి వ్యాపిస్తున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. దాంతో నగరంలోని పలు ఆసుపత్రులతో రోగులతో నిండిపోతున్నాయి. బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ పాథాలజిస్ట్ డాక్టర్ సంజయ్ మెహతా మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కోవిడ్ కేసులు కనిపిస్తున్నాయని.. తమ ఆసుపత్రి ల్యాబ్‌లో రోజుకు సగటున ఏడు కంటే ఎక్కువ కొవిడ్, హెచ్1ఎన్1 పాజిటివ్ కేసులు వస్తున్నాయని తెలిపారు. బాంబే హాస్పిటల్ సీనియర్ వైద్యుడు డాక్టర్ గౌతమ్ భన్సాలి మాట్లాడుతూ ప్రస్తుతం ఒకేసారి అనేక వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఇప్పుడు వైరస్‌లదే ఆధిపత్యం కొనసాగుతోందన్న ఆయన.. స్వైన్ ఫ్లూ, ఇన్‌ఫ్లుయెంజా, ఆర్ఎస్‌వీ కేసులు ఎక్కువగా చూస్తున్నామని చెప్పారు. ఈ వైరస్‌ల కారణంగా అధిక జ్వరం, తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు కలిగిస్తున్నాయని, కొన్నిసార్లు ఆసుపత్రి చికిత్స అవసరమవుతోందని వైద్యులు తెలిపారు. ఇక సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ హేమంత్ థాకర్ మాట్లాడుతూ



ఓపీడీలో ప్రతి రోజూ కొత్త కోవిడ్ కేసులు వస్తున్నాయని తెలిపారు. గత నెలలో స్వైన్ ఫ్లూ కేసులు ఎక్కువగా కనిపించాయని పేర్కొన్నారు. గత 7--10 రోజుల్లో కోవిడ్ కేసులు కూడా మళ్లీ పెరుగుతున్నాయన్నారు.
కొవిడ్ కేసుల పెరిగేందుకు కారణాలు..?
బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా మాట్లాడుతూ కొన్ని కోవిడ్ కేసులు నమోదయ్యాయని, ప్రధానంగా వాతావరణ మార్పుల ప్రభావమే ఇందుకు కారణం కావచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. రుతుపవనాలు ఆలస్యం కావడం వల్ల గాలిలో వైరస్‌లు ఎక్కువకాలం ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. డాక్టర్ థాకర్ మాట్లాడుతూ వర్షాలు ఆలస్యమవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడవచ్చని, రుతుపవనాలు ప్రారంభమైతే కేసులు తగ్గే అవకాశం ఉందని చెప్పారు.ఇటీవల ముంబయిలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. భారత వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేసింది. అలాగే మహారాష్ట్రలో ఉక్కపోతతో కూడిన వేడి వాతావరణం కొనసాగుతుందని హెచ్చరించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. వైరస్‌లు అన్ని వాతావరణాల్లో వ్యాపించగలవు కాబట్టి జాగ్రత్తలు అవసరమే. పలు అధ్యయనాలు శీతాకాలంలో కోవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. వేసవిలో ఇది పూర్తిగా తగ్గిపోతుందన్న దాంట్లో అర్థం లేదని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.కోవిడ్-19 లక్షణాలు :జ్వరం, చలి, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గొంతు నొప్పి, ముక్కు కారడం లేదంటే ముక్కు దిబ్బడ, రుచి-వాసన కోల్పోవడం, అలసట, శరీర నొప్పులు, తలనొప్పి, వికారం-వాంతులు, డయేరియా.లిస్వైన్ ఫ్లూ లక్షణాలు:లి జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం, శరీర నొప్పులు, అలసట, తలనొప్పి, కొన్నిసార్లు వికారం-వాంతులు (పిల్లల్లో ఎక్కువగా కనిపించేందుకు ఆస్కారం ఉంటుంది).
ఆర్ఎస్‌వీ లక్షణాలు : ముక్కు కారడం, దిబ్బడ, ఆకలి తగ్గడం, దగ్గు, తుమ్ములు, జ్వరం, శ్వాసలో వీజింగ్.

# ఓల్డ్ బోయిన్పల్లి హెచ్.ఎ.ఏల్ పార్క్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**టీ.ఆర్.9 టీవీ న్యూస్ ఛానల్ మరియు హెచ్.ఎ.ఏల్ వాకర్స్ ఆధ్వర్యంలో**

ఓల్డ్ బోయిన్పల్లి, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిపల్లి 264 డివిజన్లో గల రాజ రాజేశ్వరి నగర్ కాలనీలో టీ.ఆర్.9 టీవీ న్యూస్ ఛానల్ మరియు హెచ్.ఎ.ఏల్ పార్క్ వాకర్స్ సంయుక్త ఆధ్వర్యంలో యోగ దినోత్సవ వేడుకలు యోగ గురువు సంజీవ రాయుడు యోగ అభ్యసంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఓల్డ్ బోయినపల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్,హెచ్.ఎ.ఏల్ కాలనీ ప్రెసిడెంట్ రాంబాబు,రాజ రాజేశ్వరి నగర్ చక్రపాణి,టీ. ఆర్ టీవీ న్యూస్ ప్రతినిధి సంతోష్ కుమార్ పూదరి,హెచ్.ఎ.ఏల్ పార్క్ వాకర్స్ సభ్యులు యోగలో పాల్గొన్నారు.అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపుకుంటాం.
ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 జూన్ 21, ఆదివారంతో 12వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ ఏడాది నిర్వహించే వేడుకలకు ఒక ప్రత్యేకత ఉంది. కోల్‌కతాలోని ప్రసిద్ధ 'రెడ్ రోడ్' వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా ఈ యోగా వేడుకలకు నాయకత్వం వహించనున్నారు. ఐక్యరాజ్యసమితిలో భారత్ ప్రతిపాదించిన ఒక ఆలోచన నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను పెంపొందించే ఒక అంతర్జాతీయ ఉద్యమంగా ఎలా రూపాంతరం చెందిందో ఈ వేడుకలే నిదర్శనం.ఈ సందర్భంగా యోగా దినోత్సవం, చరిత్ర గురించి తెలుసుకుందాం..అసలు "యోగా" అనే పదం సంస్కృత మూలాలైన "యుజ్", "యుజిర్" నుంచి ఉద్భవించింది. దీని అర్థం కలపడం లేదా ఏకం చేయడం అని అర్థం.మానసిక, శారీరక, ఆధ్యాత్మిక శక్తులను ఏకం చేయడంతో పాటు.. మానవాళికి, ప్రకృతికి మధ్య సామరస్యాన్ని పెంపొందించడాన్ని యోగా సూచిస్తుంది. మారుతున్న కాలంతో పాటు మారుతున్న జీవనశైలిని దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది 2026 అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే ప్రత్యేక థీమ్‌ను నిర్ణయించారు. అనంతరం యోగా సభ్యులు ముద్దం నర్సింహ యాదవ్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సంజీవ రాయుడు, వాసవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల అశోక్ గుప్తా, హెచ్.ఎ.ఏల్ కాలనీ ప్రెసిడెంట్ రాంబాబు, రాజ రాజేశ్వరి నగర్ జనరల్ సెక్రటరీ చక్రపాణి, వాకర్ సీనియర్ సభ్యుడు శోభన్ బాబు, శైలనూరి హరిబాబు చారి, ఎస్. నారాయణ్, వినోద్ కుమార్,గౌరీ శంకర్, సంతోష్ కుమార్ పూదరి, రేఖ గోయల్, అరుణ, ధనలక్ష్మి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధంగా**

**'బహుజన వర్కర్స్ యూనియన్' ఆవిర్భావం....**

**చైర్మన్ గా సంపత్ ముదిరాజ్....**

**కార్మికులకు రూ. 5 లక్షల బీమా సదుపాయం...**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ కార్మిక సంఘంగా 'బహుజన వర్కర్స్ యూనియన్' ను పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. ఆర్టీసీని బేషరతుగా, పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయడమే ఈ యూనియన్ ఏకైక డిమాండ్ మరియు సింగిల్ పాయింట్ ఎజెండా అని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు తీవ్ర అభద్రతాభావంతో బతుకుతున్నారని, వేల కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులను కొల్లగొట్టి, సంస్థను ప్రైవేటీకరించేందుకు గత పాలకులు కుట్రలు చేశారని మల్లన్న విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం క్యాబినెట్ తీర్మానాలు చేసి అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. దళారీ వ్యవస్థను నడిపే ఇతర సంఘాలకు కేవలం యూనియన్ ఎన్నికల పైనే ఆసక్తి ఉందని, కానీ బహుజన వర్కర్స్ యూనియన్ కు ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఇతర కార్మిక సంఘాలు కూడా ఎన్నికల ప్రచారాలు పక్కనపెట్టి, విలీనమే ఏకైక



అజెండాగా తమతో కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రధాన హామీలు మరియు కార్యాచరణ

రూ. 5 లక్షల బీమా: బహుజన వర్కర్స్ యూనియన్ లో పనిచేసే కార్మికులందరికీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున రూ. 5 లక్షల ఉచిత బీమా (ఇన్సూరెన్స్) సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. పెండింగ్ బెనిఫిట్స్: రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు రావలసిన పెండింగ్ బెనిఫిట్స్ (ప్రయోజనాలు) ఇప్పించేలా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇచ్చారు. సమన్వయకర్త నియామకం: పార్టీకి మరియు యూనియన్ కు మధ్య కోఆర్డినేటర్ గా తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు సంకూరి శ్రీనివాస్ వ్యవహరిస్తారని తెలిపారు.

భువనగిరి సభకు పిలుపు



రాబోయే జూలై 5వ తేదీన భువనగిరిలో జరగనున్న 'రాజ్యాధికార సమరభేరి' సభలో ఆర్టీసీ కార్మికులు భారీ ఎత్తున పాల్గొని సభ ను విజయవంతం చేయాలని కోరారు. రాబోయే రాజ్యాధికార ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు పెద్దన్న పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రెండు మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలలో బహుజన వర్కర్స్ యూనియన్ జెండా ఎగరవేస్తామని, ఆర్టీసీ విలీనం కోసం నిరంతరం కష్టపడే శక్తిగా యూనియన్‌ను మారుస్తామని తీన్మార్ మల్లన్న ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, ఎంబీటి పార్టీ ప్రతినిధి అంజద్ ఉల్లాఖాన్ మరియు ఆర్టీసీ యూనియన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ జాతిని చైతన్యం చేయడం కోసంమే "గో టు విలేజ్"....

**-మాదిగ జాతి విద్యార్థులలో అక్షరాస్యతను పెంచి...**

**చైతన్య పరచడమే లక్ష్యం...**

**- ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలను వినియోగించుకొని**

**ప్రతి మాదిగ విద్యార్థి చదవాలి....**

**- ప్రతి మాదిగ యువత ఉద్యోగం సాధించాలి....**

**-నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎం.ఎస్.పి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో ఎంఆర్పిఎస్, ఎం.ఎస్.పి, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం ఆదివారం రోజు జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎం.ఎస్.పి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ పాల్గొని మాట్లాడుతూ.... మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామాలలో చదువుకున్న విద్యార్థులు, నిరుద్యోగులు ఉపయోగించుకొని ఉద్యోగాలు సాధించేలా చైతన్య పరచడంతో పాటు, జాతి ఆత్మగౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ దిమ్మెలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకొని, జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున పండగ వాతావరణం లో చేపట్టాలని తెలియజేస్తూ"గో టు విలేజ్" కార్యక్రమం సందర్భంగా ఉన్న ప్రతి గ్రామాలలో జాతిని సంఘటితం చేస్తూ ప్రచారాలలో పాల్గొని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు కొనసాగాలని పిలుపునిచ్చారు. నూతన ఎమ్మార్పియస్, ఎంఎస్పీ, ఎమ్మెస్సెఫ్ గ్రామశాఖలను ఎన్నుకోవడం జరిగింది.దండోరా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎర్ర జాన్సన్ మాదిగ జీవిత భాగస్వామిని గౌరవంతో ఎమ్మార్పియస్ పక్షానా సన్మానించడం జరిగింది.

గుండ్ల గూడెం నూతన ఎమ్మార్పియస్ కమిటీ

అధ్యక్షులు ఎర్ర మధు మాదిగ, ప్రధాన కార్యదర్శి ఎర్ర మహేష్ మాదిగ, అధికార ప్రతినిధి గ్యార శ్రీకాంత్ మాదిగ, కార్యదర్శి బొల్లం కరుణాకర్ మాదిగ, కార్యవర్గ సభ్యులు ఎర్ర సురేష్ మాదిగ, మద్దూరి మధుకర్ మాదిగ,





ఇంజ రాము మాదిగ, ఎర్ర మహేందర్ మాదిగ, ఎర్ర సుదర్శన్ మాదిగ, గ్యార సాయి మాదిగ, మద్దూరి సందీప్ మాదిగ, ఎర్ర రాజశేఖర్ మాదిగ, ఎర్ర చంద్రశేఖర్ మాదిగ, తాండ్ర సంపత్ మాదిగ, ఎర్ర ప్రవీణ్ మాదిగ లు

గుండ్లగూడెం నూతన ఎంఎస్పీ కమిటీ

అధ్యక్షులు భైరపాక ఇసాక్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గుంపుల విజయ్ మాదిగ, అధికార ప్రతినిధి పర్రె ప్రభాకర్ మాదిగ, కార్యదర్శి గ్యారా పరుశరాములు మాదిగ, కార్యవర్గ సభ్యులు ఎర్ర ఆనంద్ మాదిగ, మోత్కూపల్లి రాజు మాదిగ, ఎర్ర అనిల్ మాదిగ, గొల్లపల్లి ప్రసాద్ రావ్ మాదిగ, గొల్లపల్లి అశోక్ మాదిగ లు

గుండ్లగూడెం నూతన ఎమ్మెస్సెఫ్ కమిటీ

అధ్యక్షులు ఎర్ర అఖిల్ మాదిగ, ప్రధాన కార్యదర్శి మోత్కూపల్లి సహర్ష్ మాదిగ, అధికార ప్రతినిధి గ్యార భరణ్ మాదిగ, కార్యదర్శి గ్యార పవన్ మాదిగ, కార్యవర్గ సభ్యులు గ్యార అవినాష్ మాదిగ, బొల్లం చరణ్ మాదిగ, గంపల లోకేష్ మాదిగ, ముద్దేపాక కరణ్ మాదిగ, ముద్దేపాక కార్తీక్ మాదిగ,ముద్దేపాక కౌశిక్ మాదిగ, చీటకోరు రాజ్ మాదిగ,మద్దూరి మాణితేజ్ మాదిగ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్



మండల అధ్యక్షులు కందుల నర్సింగ రావ్ మాదిగ, పట్టణ అధ్యక్షులు పుల్లూరి రవి మాదిగ, వి.ఎచ్.పి.యస్ జిల్లా నాయకులు జాలపు సిద్దా రెడ్డి, ముక్క స్వామి మాదిగ, భైరపాక ఇసాక్ మాదిగ, పర్రె ప్రభాకర్ మాదిగ, ఎర్ర మధు మాదిగ, ఎర్ర మహేష్ మాదిగ, గ్యార శ్రీకాంత్ మాదిగ, బొల్లం కరుణాకర్ మాదిగ, ఎర్ర సురేష్ మాదిగ, మద్దూరి మధుకర్ మాదిగ, ఇంజ రాము మాదిగ, ఎర్ర మహేందర్ మాదిగ, ఎర్ర సుదర్శన్ మాదిగ, గ్యార సాయి మాదిగ, మద్దూరి సందీప్ మాదిగ, ఎర్ర రాజశేఖర్ మాదిగ, ఎర్ర చంద్రశేఖర్ మాదిగ, తాండ్ర సంపత్ మాదిగ, ఎర్ర ప్రవీణ్ మాదిగ విజయ్ మాదిగ, గ్యారా పరుశరాములు మాదిగ, ఎర్ర ఆనంద్ మాదిగ, మోత్కూపల్లి రాజు మాదిగ, ఎర్ర అనిల్ మాదిగ, గొల్లపల్లి ప్రసాద్ రావ్ మాదిగ, గొల్లపల్లి అశోక్ మాదిగ ఎర్ర అఖిల్ మాదిగ, మోత్కూపల్లి సహర్ష్ మాదిగ, గ్యార భరణ్ మాదిగ, గ్యార పవన్ మాదిగ, గ్యార అవినాష్ మాదిగ, బొల్లం చరణ్ మాదిగ, గంపల లోకేష్ మాదిగ, ముద్దేపాక కరణ్ మాదిగ, ముద్దేపాక కార్తీక్ మాదిగ, ముద్దేపాక కౌశిక్ మాదిగ, చీటకోరు రాజ్ మాదిగ, మద్దూరి మాణితేజ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


## యాదాద్రి జిల్లా బిజెపి మహిళా మోర్చా

# అధ్యక్షురాలుగా మాధురి చంద్ర ఎన్నిక...

**చల్లూరు వాసి రెండోసారి ఎంపిక పట్ల హర్షం**


**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాజపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన బుల్లెట్ మాధురి చంద్ర రెండోసారి నియమితులైన సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మాధురి చంద్ర విద్యార్థులను ఉద్యమం వైపు చైతన్యపరిచి ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపారు. తెలంగాణ ఉద్యమ జేఏసీలో కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉద్యమ విజయానికి విశేష కృషి చేశారు. రాజకీయ జీవితంలో మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతూ... పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తూ వచ్చిన ఆమె గతంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. అనంతరం 2024లో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీ పట్ల నిబద్ధత, మహిళా సాధికారత కోసం చేసిన కృషి, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, పార్టీ అభివృద్ధి కోసం చేసిన సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఆమెకు మరోసారి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలి బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు అప్పగించిన ప్రతి బాధ్యతను విజయవంతంగా నిర్వహించిన మాధురి చంద్ర కేంద్ర నాయకత్వం, రాష్ట్ర మహిళా మోర్చా నాయకత్వం, జిల్లా నాయకుల ప్రశంసలు పొందారు. భవిష్యత్తులో కూడా పార్టీ అభివృద్ధికి, మహిళల సంక్షేమానికి మరింత కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాధురి చంద్ర బిజెపి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.






# అక్రమ ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్ ల పై కేసు నమోదు... రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో.....






హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట ఎస్ఐ వై.లింగారెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం ఈ కేసు యొక్క వాస్తవాలు ఏమిటంటే, ఆదివారం రోజు మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో గందమళ్ళ గ్రామం నుండి రాజపేటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేయటం జరిగినదని తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ల నంబర్స్ 1) టిజి 30 జి 3827, 2).టిజి 05 హెచ్.టి/ఆర్ 4261 ల ద్వారా ఇసుకను తరలిస్తున్న వారి పేర్లు వారు.1రి గజం వంశీ కుమార్ తండ్రి మురళి, గ్రామం గందమళ్ళ, తూర్కపల్లి మండలం. 2రి బట్ట దయానంద్ తండ్రి బాలనరయ్య గ్రామం గందమళ్ళ, తుర్కపల్లి మండలం ట్రాక్టర్ లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# అయోధ్య నగర్ బస్తీ ప్రెసిడెంట్ గా బాబీ

**నాన్న ఆశయాలతో ముందడుగు, కాలనీ అభివృద్ధే లక్ష్యం**





జీడీమెట్ల, జూన్ 21,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
కుతుబుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అయోధ్య నగర్ కాలనీ (బస్తీ ) లో కాలనీ అధ్యక్ష్య ఎన్నికలు నిర్వహించారు. ఆదివారం రోజు ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించిన అధ్యక్ష ఎన్నికల్లో వివిధ గుర్తులతో అభ్యర్థులు పోటి చేయగా గంట గుర్తు అభ్యర్థి బాబీ గెలుపొందారు.అభివృద్ధే లక్ష్యంగా,నిబద్దతే బాధ్యతగా, సౌకర్యాల కల్పనే ధ్యేయంగా గతంలో దివంగత నేత నాన్న ఏసన్న కాలనీలో చేసిన సేవలు, మౌలిక వసతులు,నియోజకవర్గ ఎమ్మెల్యే కే.పి వివేకానంద సహకారంతో గెలుపొందానని బాబీ తెలిపారు. కాలనీలో రామాలయ నిర్మాణమే తన లక్ష్యమని, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై నిరంతరంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు,నాన్న అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.